నింద మురహరి చెవుల్లోనూ పడ్డది. కుమిలి పోయాడు అవమానంతో, ఎండలో వేసిన నల్లి వలె. దుఃఖం, నైరాశ్యం ప్రబలింది అతని నాడుల్లో విద్యుచ్ఛక్తి ప్రవాహం మల్లే. ఆ తీవ్ర భారానికి దారుణమైన జ్వరాలు వచ్చాయి; ఎంతమంది డాక్టర్లు మందులిచ్చినా ప్రయోగం లేక యీ కుళ్లు సంఘాన్ని, లోకాన్ని వీడి పోయాడు మురహరి.

అతడు నిజమైన మానవ సేవకుడు. యీ లోకంలోని మిట్టపల్లాలు, హెచ్చుతగ్గులు అర్థం చేసుకొని, దయ సానుభూతి పశ్చాత్తాప అనుభూతులలో జీవితాన్ని గడపిన అమరజీవి. అతనికి చేసిన అన్యాయం, అపకారానికి మీరంతా పశ్చాత్తాపపడితే, మీరంతా ఆయన భావాలకి ఒక రూపం కల్పించడంకోసం ఒక సంస్థను లేవదీస్తే బాగుంటుంది. భూరి విరాళాలిచ్చి తోడ్పడండి" అని ప్లీడరు రామారావు గంభీరోపన్యాసమిస్తే, సమావేశమైన మేమంతా భారమైన హృదయాల్తో విన్నాము.

# ★ తిరిగి వచ్చిన శశి ★

దండమూడి మహీధర కుమార్

నేనింకా నిద్రనుంచి లేవలేదు. మంజు వచ్చి లేపింది. మంజుమీద కోపం వచ్చింది-మళ్లా ముసుగు పెట్టుకున్నాను. కప్పుకున్న శాలువా లాగేసి 'ఎవరో వచ్చా'రన్నది. కళ్లు తెరవటానికి యత్నించాను. రాత్రి చాలా ప్రొద్దుపోయేంత వరకూ మేల్కొని ఏదోరాసుకోవటం వల్ల ఉదయం మెలుకువ వచ్చిందే కాదు. ఎవరో వచ్చారనేప్పటికి లేవాలని ఎంత యత్నించినా బద్ధకం నన్ను లేవనీయటం లేదు. ఎదురుగా నిల్చున్న మంజు అలా చూస్తోంది - నవ్వుతూ! 'మంజూ! ఆ వచ్చిన వ్యక్తితో ఇంకో గంట ఆగి రమ్మని చెప్పు-నాకు చాలా బద్ధకంగావుంది-అన్నాను. 'ఆ వచ్చింది ఎవరో స్త్రీ' అనేప్పటికి నాకు ఎక్కడ లేని భయం పుట్టుకొచ్చింది. ఉదయానికి ఉదయాన - ఎనిమిదన్నా కాలేదు ఎవరో రావటం, ఆ వచ్చినది ఒక స్త్రీ అవటం నన్ను పలురకాలైన ఆలోచనల్లో నింపింది. అన్నాను— 'మంజూ, వెళ్ళి ఇప్పుడే వస్తానని చెప్పు-మొహం కడుక్కొని వస్తాను.'- మంజు వెళ్ళిపోయింది.

బద్ధకంగా లేచి పెరట్లోకి వెళ్ళ బోతుండగా ఆ వచ్చింది ఎవరో అనే భావం రావటంతో నాకు భయమేసింది. ఎవరై వుండొచ్చు? ఇంత ఉదయం ఎవరు రాగలరు? ఈవూళ్లో ఎవరూ స్నేహితురాళ్లు లేరు. మంజుకా అంటే కాదు. ఇలా ఆలోచించి పెరట్లోకి వెళ్ళబోయే నేను డ్రాయింగు రూం ప్రక్క గదిలోకి వెళ్లాను. ఆ వచ్చిన వ్యక్తి మంజుతో మాట్లాడుతోంది - గొంతునుబట్టి పోల్చుకో గలిగాను - భయం ప్రతి అవయవంలోనూ ప్రవేశించి నన్ను నిర్జీవుణ్ణి చేసింది. ఆమె ఎందుకొచ్చిందో అర్థంకాక ఎంతో తికమక పడ్డాను.

ఆమె శశి.

"నువ్వు మధుభార్యవా? అయితే నీవు అదృష్టవంతురాలివి! మధు చాలా సహృదయుడు. అతనికి భార్యగా వుండి నీ వెన్నో పేరు చ్చోగలుగుతావు. నీభవిష్యత్తు ఉజ్వలమైంది. మీ దాంపత్యం నిత్య వసంతంగా పంద నందనవనాలకి ఆలవాలం కావటమే నా అభిమతం'- అయితే మంజూ, మధు ఇంకా రానే లేదు-నే వెళ్తాను! మధుతో చెప్పు, నా పేరు శశి. నెల్లూరునుంచి వస్తున్నాను. నిన్ను చూడగలిగేను, అనుకోకుండా - అదే నా సంతోషం. వెళ్లొస్తాను.'

ఈ మాటలు విన్నాక అలాగే బయటికి రావాలనుకున్నా. కాని నాలో ఆ సాహసం లేక పోయింది.

'ఇప్పుడే రావటం ఇప్పుడే వెళ్ళటం - ఇదేం సభ్యత!' అంటోంది మంజు.

'సరే, మధు వచ్చేంత వరకూ వుంటాను. పెళ్ళికి పిలిచేదేకాదు! కనీసం ఇప్పుడేనా అభినందన లందజేస్తాను' అన్నది శశి.

గబగబా దొడ్లోకివెళ్లి మొహం కడుక్కొని- తల దువ్వుకొని అలాగే వచ్చాను. కాని నాలో ఎన్నెన్నో భావాలు లేస్తున్నాయి. శశి ఇక్కడికి రావటంలోని ఉద్దేశ్యం? డ్రాయింగ్ రూమ్ లోకి వచ్చాను. నేనూ మంజు కలిసి తీయించుకున్న ఫోటోవంక శశి ఆశాపూరిత నేత్రాలతో చూస్తోంది. నే రావడంతో ఆఫోటో అవతలుంచి నావేపు తిరిగి నవ్వుతూ 'మధూ! పెళ్లి విషయం తెలిపావేకాదు! మేం రావటం ఇష్టం లేదు గాబోలు.''

"లేదు శశీ! చాలా అకస్మాత్తుగా చేసుకో వలసి వచ్చింది. మీకు తెలుపలేక పోయాను.''

ఇంతలోకే మంజు ఏదో పనిమీద లోనికెళ్లింది. "నువ్వు నా జీవితంలో చిచ్చును రగిల్చావు. వర్తి ఘాతకుడివి. నీవు రాసిన ఉత్తరాల్ని ఆధారం చేసుకొని గోపీ నన్ను ఇంటి నుంచి వెళ్లగొట్టాడు! ఇంటికి వెళ్తూ ఒకసారి నీకు కన్పించి నీవు నాయెడల వర్తించిన విధానం ఈరీతిగా పరిణమించిందని తెల్పటానికి ఇక్కడ దిగాను. ఇక్కడ నీవు నీ రాణితో సుఖంగా ఉన్నావు. ఏమీ మారు మాట్లాడకుండా వెళ్లిపోదా మనుకున్నా. కాని అలా చేయలేక పోయాను. సరే నే వెళ్తున్నా"-ఇవి శశి పలికిన పలుకులు.

ఏమి మాట్లాడాలో తెలీలేదు. ఉభయులం మౌనంగా వచ్చిన సమయంలో మంజూ ప్రవేశించి 'అరే! ఇలా నిల్చున్నారే? లోనికివచ్చి కూచోండి నేను వంట యత్నంలో వుంటాను'' అన్నది.

'లేదు మంజూ! నే వెళ్లాలి-చాలా అవసరం. నిన్ను చూచాను - ఇక వెళ్తాను. ఇప్పుడే ఒక రైలుంది. పదకొండు గంటలకల్లా బెజవాడలో వుంటాను-' అపైని మంజు ఏదో చెప్పబోతుండగా-ఏమీ వినిపించుకోకుండా అలాగే వెళ్లిపోయింది. 'ఉండమని అనవేం' అని నన్ను అంది. నేను ఏమీ మాట్లాడలేకపోయాను.

"శశి చెప్పింది: నీవు శశికి చిన్ననాటి స్నేహితుడవట! కాలేజీకి వెళ్లేంతవరకూ ఒకేచోట కలిసివుండి చదువుకున్నారట! అలాంటి స్నేహితురాలికి పెళ్లి విషయం తెలపకపోవటం చాలా సంతాపకరమైన విషయమంటూకూడా నిన్ను గూర్చి ఎంతో ప్రశంసించింది.''

'లేదు మంజూ! ఆమె హృదయంలో ప్రచండమైన అగ్నిజ్వాలలు లేస్తున్నాయి. వాటిని నేనుమాత్రమే చూడగలను. వాటికి కారకుణ్ణి నేనే! నీకు తెలీదు మంజూ! ఆమెను నేనే అన్యాయం చేశాను.

ఆమె నా చిన్ననాటి స్నేహితురాలు. ఉభయులం ప్రేమించుకున్నాం. అయితే మా ప్రేమ సఫలమవలేదు. కొన్ని అవాంతరాలు ఏర్పడ్డాయి, ఆమె గోపీ వివాహమాడింది. నే చూడలేక పోయాను. ఎక్కడెక్కడికో వెళ్లిపోయాను. శశిని మరిచేందుకు ఎంతో యత్నించాను. కాని నేనలా చేయ లేక పోయాను. ఆఖరికి శశికి ఉత్తరాలు రాశాను. 'నువ్వు నాదానివి. నేను నిన్ను మినహా మరెవ్వరినీ ప్రేమించలేను, నీవు వచ్చెయ్! నేను నీకోసం జన్మజన్మాంతరాల వరకూ అవివాహితుడుగా వుంటాను. గోపీని నీవు ప్రేమించలేవు. అలాగని నీవు అన్నా అది మోసం. నీవు ఎప్పటికీ నా దానివి, నీవు నన్ను వినా అన్యుల్ని ప్రేమించ లేవు. నీవునన్నూ, నేను నిన్నూ, పరస్పరంగా ప్రేమించుకునేందుకే మనిద్దరం జన్మించాం. ఈ రోజు ఎవరైనా నీవు గోపీని ప్రేమిస్తున్నావని చెబితే, అది ప్రేమించటం కాదంటాను. అలాగే నీవు ప్రేమించటం లేదన్నా, అది ప్రేమించటమే అని నావాదం. వచ్చెసెయ్" ఇవేభావాలు నేను శశికి ఉత్తరాల పరంగా రాశాను. వీటిని గోపీ చదువుకుని ఆఖరికి శశిని వెళ్ళగొట్టేశాడు. నా ఆసరా చూచుకొని ఇల్లు వీడి వచ్చింది కాని చాలా ఆలస్యం చేసింది, నా వద్దకు రావటంలో! నేను వాస్తవంగా శశి జీవితాన్ని నాశనం చేశాను.''

మంజు ఇదంతా విని ఒక నిట్టూర్పు విడిచి- "ఇదంతా నాకు ముందే తెలిసివుంటే శశిని హృదయ పూర్వకంగా ఈ ఇంట్లోకి ఆహ్వానించే దాన్ని! కాని సమయం చేజారిపోయింది. శశి జీవితం సమాప్తమైంది. ఆమె జీవించ లేదు. ఆ స్థానంలో ఏ స్త్రీ ఉన్నా ఇప్పటికి ప్రాణాలు వీడి వుంటుంది.

"ఇంకా పురుషుడు స్త్రీని సానుభూతితో అర్థం చేసుకోలేదు.'' నిజమే అన్నట్లు గడియారం పది కొట్టింది.